సాక్షి
అనకాపల్లి

శనివారం । 2 । ఆగస్టు । 2025



గళమెత్తిన గంగపుత్రులు

బల్క్‌డ్రగ్ పార్క్ వద్దంటూ రాజయ్యపేటకు చెందిన వందలాది మంది మత్స్యకారులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. 8లో



వినూత్నంగా వృక్షాబంధన్

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ రోడ్డులోని 138 ఏళ్ల మర్రిచెట్టుకు శుక్రవారం గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో రాఖీ కట్టి పూజలు చేశారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజుల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 36.0 నుంచి 36.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27.2 నుంచి 27.8 డిగ్రీలు నమోదు కావచ్చన్నారు.

న్యూస్‌రీల్

స్పీకర్ స్పందించకపోతే నిరసన అమరావతికి..



నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతున్న బూసి వెంకటరావు

నర్సీపట్నం: జి.కోడూరు క్వారీపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించకపోతే నిరసన అమరావతికి మారుతుందని విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు పేర్కొన్నారు. మాకవరపాలెం మండలం జి.కోడూరు క్వారీని ఆయన సందర్శించి, ఆర్డీవో కార్యాలయం వద్ద బాధిత దళిత రైతులు చేస్తున్న నిరాహారదీక్ష శిబిరానికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే నెంబరు 332లో మైనింగ్ కార్యకలాపాలు దళిత రైతుల జీవనాధారాన్ని దెబ్బతిస్తున్నాయన్నారు. స్పీకర్ వెంటనే స్పందించి క్వారీ లీజు రద్దు చేయించాలన్నారు. గతంలో మైనింగ్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన టీడీపీ నాయకులు క్వారీని నిర్వహించటం దారుణమన్నారు. మైనింగ్ కార్యకలాపాలకు అనుమతులు ఇచ్చే ముందు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నిబంధనల ప్రకారం క్వారీలు వ్యవసాయ భూముల నుంచి కనీసం 500 మీటర్ల దూరంలో ఉండాలన్నారు. కానీ ఇక్కడ 5 మీటర్ల దూరం కూడా లేదన్నారు. ఈ క్వారీ బ్లాస్టింగ్ వల్ల బూడిద జీడి, మామిడి తోటలపై పడి పంటలకు నష్టం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్ని యాదవ్ నాగరాజు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులపై కేసు కొట్టివేత

అనకాపల్లి టౌన్: ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించిన కేసులో అగ్రిగోల్డ్ బాధితులు నిర్దోషులని కోర్టు తీర్పు ఇచ్చినట్టు న్యాయవాది కనిశెట్టి సురేష్ బాబు తెలిపారు. ఆయన అందించిన వివరాలు.. 2019 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఇంటికి తమ సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి అగ్రిగోల్డ్ బాధితులు వెళ్లారు. అయితే తన ఇల్లు ముట్టడించారని, రాకపోకలకు అంతరాయం కల్పించారని పీలా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు పెట్టారు. నిందితులపై మోపిన నేరానికి పోలీసులు సరైన సాక్ష్యం చూపించలేకపోయినందున శుక్రవారం కేసు కొట్టేశారని లాయర్ తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితుల సంఘం అధ్యక్షుడు కర్ణం మాణిక్యాలరావు మాట్లాడుతూ ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందన్నారు.

8 నుంచి ఏపీఎల్ నాలుగో సీజన్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) నాలుగో సీజన్ ఈ నెల 8న ప్రారంభం కానుంది. మొదటి మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్‌తో అమరావతి రాయల్స్ తలపడనుంది. పీఎంపాలెంలోని వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో రాత్రి 7.30 గంటలకు ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఈ మ్యాచ్ జరుగుతుంది. ఈ సీజన్‌లో మొత్తం ఏడు జట్లు పోటీ పడనున్నాయి. లీగ్ చివరి మ్యాచ్ 19న జరుగుతుంది. 21న మధ్యాహ్నం 1.30 గంటలకు ఎలిమినేటర్ మ్యాచ్, 21న రాత్రి 6.30 గంటలకు క్వాలిఫైయర్-1, 22న రాత్రి 6.30 గంటలకు క్వాలిఫైయర్-2, 23న ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు ప్రకటించారు. ఏడు జట్ల ఆటగాళ్లు ఈ నెల 5, 6 తేదీల్లో విశాఖ చేరుకుని ప్రాక్టీస్ చేయనున్నారు.



■ రైతన్నకు గుండెకోత

వరుణుడి కరుణ లేక వర్షాలు కురవలేదు.. ప్రభుత్వం అందించిన నకిలీ విత్తనాలు మొలకెత్తలేదు.. 'కూటమి' పాలనలో తొలి ఏడాది భరోసా దక్కక, ఈసారైనా పెట్టుబడి సాయం అందుతుందని ఆశగా ఎదురుచూస్తున్న రైతన్నకు అధికారుల ప్రకటన అశనిపాతంలా తాకింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాయం అందుకున్న రైతుల సంఖ్య కంటే ఈసారి 34,090మంది తగ్గిపోయారు. మేమేం చేశాం పాపం అంటూ వారు కన్నీరు పెట్టుకుంటున్నారు.



సుఖీభవ దక్కని అన్నదాతలు 34,090

- కూటమి ప్రభుత్వంలో అడ్డగోలుగా కోతలు
- గత ఏడాది ఇవ్వకుండా ఎగవేశారు
- ఈ సంవత్సరం భారీగా తగ్గించేశారు
- అన్ని విధాలా దగా పడ్డ రైతన్న

వైఎస్సార్‌సీపీ పాలనలో 2023-24లో భరోసా పొందిన అన్నదాతలు	2,65,778
కూటమి సర్కారు పాలనలో 'అన్నదాత సుఖీభవ' అందుకోనున్న రైతులు	2,31,688

సాక్షి, అనకాపల్లి:

అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు రైతుల ఖాతాలో జమ చేస్తామని ఇచ్చిన హామీ అమలులో కూటమి ప్రభుత్వం మోసపూరిత విధానం మరోసారి బట్టబయలైంది. గతేడాది పథకాన్ని అమలు చేయకుండా ఎగ్గొట్టిన సర్కారు ఈ ఏడాది ఇవ్వడానికి సిద్ధమైనా.. లబ్ధిదారుల జాబితాలో వేల సంఖ్యలో అర్హులైన రైతుల పేర్లు కనిపించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో 'రైతు భరోసా' లబ్ధిదారుల సంఖ్య ప్రతి ఏటా పెరిగేది. చివరి సంవత్సరమైన 2023-24లో 2,65,778 మందికి పెట్టుబడి సాయం అందింది. ఈసారి 2,31,688మందికి అందిస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించడంతో రైతుల గుండెల్లో రాయి పడింది. అర్హత ఉన్నా తమ పేర్లు లేకపోవడంపై వారు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ కష్టాలతో మొదలైంది. మే, జూన్ నెలలో ముందుగానే కురిసిన వర్షాలు కీలకమైన జూలైలో కనుమరుగయ్యాయి. వర్షాభావంతో సతమతమవుతున్న రైతులను విత్తనాల సమస్య మరింత కుంగదీసింది. నాటిన విత్తనాలు మొలకెత్తక అన్నదాతకు అన్ని విధాలా అన్యాయం జరిగింది. ఎన్నికల ముందు సూపర్-6లో భాగంగా రైతులకు ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని ఊరూవాడా ప్రకటించిన చంద్రబాబు తొలి ఏడాది పెట్టుబడి సాయానికి మంగళం పలికారు. ఈ సంవత్సరం ఇస్తున్నా 34,090మందికి మొండి చేయి చూపడంతో సర్వాత్రా నిరసన వ్యక్తమవుతోంది.

తొలి విడత రాష్ట్రం అందించేది రూ.5 వేలు

'అన్నదాత సుఖీభవ' కింద రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 వేలు, పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. అనకాపల్లి జిల్లాలో 2,31,688 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. వీరి ఖాతాల్లో మొత్తం రూ.162.17 కోట్లు జమ కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.115.84 కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్రం నుంచి రూ.46.33 కోట్లు విడుదల చేస్తారు. పీఎం కిసాన్ కింద మూడు విడతల్లో రూ.6 వేలు అందిస్తారు. అన్నదాత సుఖీభవ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలను మూడు విడతలుగా చెల్లిస్తుంది. మొదటి విడతలో రూ.5,000, రెండో విడతలో రూ.5,000, మూడో విడతలో రూ.4,000 చొప్పున విడుదల చేయనుంది. జిల్లాలో పెట్టుబడి సాయానికి అర్హత పొందిన రైతుల్లో ఈకేవైసీ పూర్తయిన వారు 2,37,057 మంది ఉన్నారు. మిగతా రైతులకు ఈకేవైసీ పూర్తి కావాల్సి ఉంది.

అర్హత ఉన్న ప్రతి రైతుకు 'సుఖీభవ' అందాల్సిందే..



గత ప్రభుత్వంలో లబ్ధి పొందిన రైతుల కన్నా ఎక్కువగా ఈ ఏడాది లబ్ధి పొందాల్సి ఉంటుంది. కానీ 34 వేల మందికి పైగా రైతులకు కోత విధించారు. ఏ ప్రాతిపదికన కోత విధించారో వ్యవసాయ అధికారులు చెప్పాలి. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నామమాత్రంగా అమలు చేస్తే సరిపోదు. గతేడాది పెట్టుబడి సాయం ఇస్తారనే ఆశతో అప్పులు చేసి వ్యవసాయం చేసి రైతు నష్టపోయాడు. రెండో ఏడాది కూడా అప్పు చేసిన 34 వేల మంది రైతులను ఆదుకునేది ఎవరు? అర్హత ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ ఇవ్వాల్సిందే.

– వెంకన్న, రైతు సంఘం నాయకుడు

స్వాతంత్య్ర దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ విజయ కృష్ణన్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో ఏర్పాట్లపై ఆమె సమీక్ష నిర్వహించారు. గత ఏడాది నిర్వహించిన మాదిరిగా పట్టణంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న ఎన్టీఆర్ మైదానంలో నిర్వహించాలన్నారు. స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలను వేడుకలకు ఆహ్వానించి సత్కరించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై స్టాల్సు ఏర్పాటు చేసి శకటాల ప్రదర్శన చేయాలని పేర్కొన్నారు. డీఆర్వో వై.సత్యనారాయణరావు, జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్) ఎల్.మోహన్‌రావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు షేక్ ఆయిషా, వివి రమణ, డీఈవో అప్పారావు నాయుడు, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వినోద్‌బాబు, ఫైర్ ఆఫీసర్లు వెంకటరమణ, మనోహర్, డీపీవో సందీప్, డీఎంహెచ్‌వో హైమావతి సమావేశంలో పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం



నాతవరం: గునుపూడిలో లబ్ధిదారుడికి పింఛను ఇస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



తుమ్మపాల: పిసినికాడ గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్

నాతవరం/తుమ్మపాల: జిల్లాలో శుక్రవారం సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నాతవరం మండలం గునుపూడి గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. అనంతరం గునుపూడి హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు, ఆర్డీవో వి.వి.రమణ, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కె.ఉషాశ్రీ పాల్గొన్నారు.

కలెక్టర్ విజయ కృష్ణన్ అనకాపల్లి మండలం పిసినికాడ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, తహసీల్దార్ ఎం.బి.అప్పారావు, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, పాల్గొన్నారు.

నరకకూపాలు.. బీసీ సంక్షేమ హాస్టళ్లు

- ప్రభుత్వం కేటాయించిన రూ.145 కోట్లు తక్షణమే ఖర్చు చేయాలి
- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ విభాగం నేతలు

తుమ్మపాల: రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రూ.145 కోట్లతో రానున్న నెల రోజుల్లో బీసీ సంక్షేమ వసతి గృహాల్లో వసతులు కల్పించకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నాతోపాటు అవసరమైతే నిరాహారదీక్ష కూడా చేస్తామని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సౌకర్యాలపై మూడు రోజుల పరిశీలన అనంతరం పార్టీ పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ స్టూడెంట్స్ విభాగం నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చి వసతి గృహాల దీన స్థితిగతులపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో హాస్టళ్ల సందర్శనలో అనేక లోపాలు గుర్తించామన్నారు. బాత్‌రూమ్స్ లేక పిల్లలు ఆరు బయట స్నానాలు చేస్తున్నారని, రెండు నెలల క్రితం ఇచ్చిన స్కూల్ బ్యాగులు నాణ్యత లేక చిరిగిపోతున్నాయని, ఇరుకిరుకు గదుల్లో 20 నుంచి 30 మంది పిల్లలను కుక్కడంతో పడుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. యోగాంధ్ర పేరుతో హాస్టల్ పిల్లల్ని రోడ్లపై పడుకోబెట్టారని, రూ.300 కోట్లు అనవసర ఖర్చు చూపించారని, ఆ నిధులను వసతీ గృహాల అభివృద్ధికి ఖర్చు చేస్తే ఏసీ గదుల్లో పిల్లలకు వసతులు కల్పించవచ్చన్నారు. విద్యావ్యవస్థను, వసతి గృహాలను నాశనం చేస్తే నారాయణ, శ్రీచైతన్య పాఠశాలలే దిక్కని ప్రజలు భావిస్తారన్న ధోరణిలో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. డీఆర్వో వై.సత్యనారాయణరావుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గాల అధ్యక్షులు రాయ్ రాజా, అప్పలనాయుడు, కిలాడ శ్రీనివాస్, పెందుర్తి నియోజకవర్గ వలంటీర్ల విభాగం అధ్యక్షుడు అవగడ్డ శ్రీనివాస్, సోషల్ మీడియా అధ్యక్షుడు శ్రీకాంత్, వివిధ విభాగాల నాయకులు నవీన్, జనపరెడ్డి శ్రీను, మురళి, మణికంఠ, వెలుగుల కిట్టు, శ్యామ్, మడక కార్తీక్, దొడ్డి సాయి పాల్గొన్నారు.

కేంద్రం ఉక్కుపంజా

- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తథ్యం
- తేల్చి చెప్పేసిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ
- కూటమి ప్రభుత్వం బండారం బట్టబయలు
- స్టీల్‌ప్లాంట్‌పై రాజ్యసభలో ఆరు ప్రశ్నలు వేసిన ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి
- వాటికి ఇచ్చిన వివరణలో కేంద్రం వైఖరి వెల్లడి
- సెయిల్‌లో విలీనం చేసే ప్రతిపాదనే లేదని స్పష్టీకరణ
- 1,017 మంది ఉద్యోగుల ఉద్వాసనకు రంగం సిద్ధం
- మండిపడుతున్న కార్మిక వర్గాలు



విశాఖ సిటీ : స్టీల్‌ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వ గూడు పుఠాణి బట్టబయలైంది. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణపై కేంద్రం కుండబద్దలు కొట్టింది. రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ (ఆర్‌ఐఎన్‌ఎల్) నుంచి వంద శాతం పెట్టుబడుల ఉపసంహరణ తథ్యం అని తేల్చేసింది. పెద్దల సభలో వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వేసిన ఆరు ప్రశ్నలకు కేంద్రం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కానివ్వబోమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇన్నాళ్లు చెప్పుకొచ్చిన బూటకపు మాటల బండారం బయటపడింది. నోటితో నవ్వి నొసటితో వెక్కిరించారన్న చందంగా కూటమి ప్రభుత్వం తీరు ఉంది. ఒకవైపు ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా చేసే బాధ్యత తమదని చెబుతూనే.. మరోవైపు ప్లాంట్‌లో వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నా చోద్యం చూస్తుండడమే దీనికి నిదర్శనం.

రాజ్యసభలో సుబ్బారెడ్డి ఆరు ప్రశ్నలు

స్టీల్‌ప్లాంట్‌పై రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ఆరు ప్రశ్నలు వేశారు. ఆర్‌ఐఎన్‌ఎల్‌కు మూలధన పెట్టుబడి లేదా ఇతరత్రా అవసరాలకు నిధులు విడుదల చేశారా? చేస్తే ఇప్పటి వరకు ఎంత చేశారు? ఆలస్యానికి గల కారణం? పరిశ్రమలో వీఆర్ఎస్ స్కీమ్ అమలు చేయడం నిజమేనా? ఎంత మంది దానికి దరఖాస్తు చేసుకున్నారు? పరిశ్రమను ప్రైవేటీకరణ చేసే ఆలోచన ఉందా? ఉంటే ఎందుకు? సెయిల్‌లో విలీనం చేసే అంశం మాటేమిటి? అని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ విస్తుపోయే సమాధానాలు ఇచ్చారు.

వెయ్యి మందికి పైగా ఉద్యోగులకు ఉద్వాసన

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు మరోసారి ఉద్వాసన పలికేందుకు ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. వీఆర్ఎస్ పేరుతో వేల మంది ఉద్యోగులను బయటకు పంపించాలని నిర్ణయించారు. ఇందుకోసం స్కీమ్‌ను ఇప్పటికే ప్రవేశపెట్టారు. జూన్ 15వ తేదీ వరకు వీఆర్ఎస్‌కు దరఖాస్తులను స్వీకరించారు. 1,017మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని కూడా కేంద్ర మంత్రి తన వివరణలో పేర్కొన్నారు.

ప్రైవేటీకరణపై స్పష్టీకరణ

స్టీల్‌ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వం ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా కేంద్రం వైఖరి మరోసారి స్పష్టమైంది. ఆర్‌ఐఎన్‌ఎల్‌లో వంద శాతం పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని 2021, జనవరి 27నే కేబినెట్ కమిటీ తీర్మానం చేసినట్లు కేంద్ర మంత్రి తేల్చి చెప్పారు. దీంతో ఇన్నాళ్లు కూటమి ప్రభుత్వం ప్రజలను మాయలో ఉంచి నాటకాలు ఆడినట్లు ఈ వివరణతో అర్థమవుతోంది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు ఏళ్లుగా ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అనేక సార్లు వేడుకున్నారు. పవన్ స్వయంగా స్టీల్‌ప్లాంట్ వద్ద సభలోనే పరిశ్రమ ప్రైవేటుపరం కాదంటూ ప్రగల్భాలు పలికారు. కానీ తాజాగా కేంద్రం తన వైఖరిని మరోసారి తేల్చి చెప్పడంతో సీఎం, డిప్యూటీ సీఎం ఇన్నాళ్లు చేసినవి డ్రామాలుగా తేలిపోయింది.

సెయిల్‌లో విలీన ప్రతిపాదనే లేదు

స్టీల్‌ప్లాంట్‌ను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేయాలని కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. దీని కోసం ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు చేపట్టాయి. కానీ అసలు ఆ ప్రతిపాదనే లేనట్లు కేంద్ర మంత్రి తేల్చేశారు. అలాగే మూలధన వ్యయం కింద కేంద్రం రూ.11,440 కోట్లు మంజూరు చేసింది. కానీ ఇప్పటి వరకు రూ.9,824 కోట్లు మాత్రమే విడుదల చేసింది. మిగిలిన మొత్తాన్ని ఎప్పుడు విడుదల చేస్తుందో? ఆలస్యానికి గల కారణాలను మాత్రం తెలపకపోవడం గమనార్హం.

అందివస్తారనుకున్న యువకులు అనంతలోకాలకు..

- కొత్తూరు జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదం
- ఇద్దరు నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగుల మృతి



మేడిశెట్టి వెంకట సూరి అప్పారావు (ఫైల్)



బిడిజన నాగ సాయి బాలాజీ (ఫైల్)



సంఘటన స్థలంలో వెంకట సూరి అప్పారావు మృతదేహం

అనకాపల్లి టౌన్: అనకాపల్లి జాతీయ రహదారి ఏఎంఏఎల్ కాలేజ్ కొత్తూరు జంక్షన్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండలం చిన యాదగిరి పాలెం గ్రామానికి చెందిన మేడిశెట్టి వెంకట సూరి అప్పారావు (28), గొలుగొండ గ్రామానికి చెందిన బిడిజన నాగ సాయి బాలాజీ (24), గాజువాకకు సైనా రవి (28) కశింకోట మండలం తాళ్లపాలెం నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. వీరు ముగ్గురూ కొత్తూరు గ్రామంలో ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. వీరందరూ కలిసి తాళ్లపాలెంలో జరిగే శుభకార్యానికి హాజరై తిరిగి వస్తూ కొత్తూరు జంక్షన్ దాటుతుండగా వెనక నుంచి వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట సూరి అప్పారావు అక్కడికక్కడే మృతి చెందగా, బాలాజీ హాస్పటల్‌కు తీసుకువెళుతుండగా మృతి చెందాడు. గాయాల పాలైన సైనా రవి ప్రైవేట్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మెలిపాకలో విషాదం

మునగపాక: అందివస్తాడనుకున్న కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలముకుంది. ఒక్కగానొక్క కొడుకుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు తీరని దుఃఖం మిగిలింది. మెలిపాకకు చెందిన మేడిశెట్టి లోవరాజు, లక్ష్మి దంపతులు వ్యవసాయం సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కుమార్తెకు వివాహం జరిగింది. కుమారుడు వెంకట సూరప్పారావు సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటూ వచ్చాడు. గురువారం రాత్రి తాళ్లపాలెంలో స్నేహితుని వివాహానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది.

గళమెత్తిన గంగపుత్రులు

- బల్క్ డ్రగ్ పార్క్ వద్దంటూ ధర్నా
- జాతీయ రహదారిపై భారీ ర్యాలీ
- తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన
- 6న జరిగే ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలంటూ నినాదాలు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, అఖిల పక్ష నాయకులు

నక్కపల్లి: ప్రమాదకర రసాయన పరిశ్రమల ఏర్పాటుపై గంగపుత్రులు గళమెత్తారు. రాజయ్యపేట సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న బల్క్ డ్రగ్ పార్క్ వద్దంటూ ఆందోళన బాట పట్టారు. శుక్రవారం రాజయ్యపేటకు చెందిన వందలాది మంది మత్స్యకారులు సారిపల్లిపాలెం జంక్షన్ నుంచి నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజుల, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు ఎరిపల్లి నాగేష్ అధ్వర్యంలో కార్యాలయం వరకు వచ్చి అక్కడ ఆందోళన నిర్వహించారు. వీరి ఆందోళనకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సీపీఎం కేంద్రం కమిటీ సభ్యుడు కె.లోకనాథం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు, మత్స్యకారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో మూడు ప్రాంతాల్లో ఈ బల్క్ డ్రగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తోందని, వాటిలో నక్కపల్లి ఒకటన్నారు. ప్రాజెక్టు రిపోర్ట్‌లో 1270 ఎకరాల్లో బల్క్‌డ్రగ్‌పార్క్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారని, ఇప్పటికే 2వేల ఎకరాలు కేటాయించారన్నారు. ఇది చాలదన్నట్లు జానకయ్యపేట, సీహెచ్‌ఎల్ పురం, పెదతీనార్ల, గుర్రాజుపేట గ్రామాల్లో మరో 800 ఎకరాలు తీసుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇన్ని వేల ఎకరాలు ఎవరి కోసం సేకరిస్తున్నారని నిలదీశారు. ఒక పక్క బల్క్ డ్రగ్ పార్క్‌ను రాజయ్యపేట, పరిసర గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తుంటే ఈ నెల 6న ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే కంపెనీలు ఏర్పాటు చేయబోమని గతంలో హోంమంత్రి అనిత పలు సందర్భాల్లో ప్రకటించారని, ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఒక పక్క భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తిగా అందలేదని పోరాటాలు చేస్తుంటే మరో పక్క ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడంపై మత్స్యకారులు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలంటూ డీటీ నారాయణరావుకు వినతి పత్రం అందించారు. ఈ ఆందోళనలో ఎంపీటీసీలు లొడగల చంద్రరావు, కొల్నాటి బుజ్జి, గొర్ల గోవిందు, గంటా తిరుపతిరావు, సర్పంచ్ ముసలయ్య, రైతు నాయకులు తళ్ల భార్గవ్, గొర్లె బాబూరావు, యలమంచిలి తాతబాబు, బొంది గోవిందు, దేవర నూకరాజు, కాశీరావు, మనబాల రాజేష్, పిక్కి నూకరాజు, యజ్జల అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పారిశ్రామికవేత్తలే ప్రధానం



బల్క్ డ్రగ్ పార్క్ అనేది అణుబాంబు లాంటిది. ఇక్కడ వందలాది యూనిట్లు స్థాపిస్తారు. భవిష్యత్‌లో పరిసర ప్రాంతాల్లో ఎవరూ ఆరోగ్యంగా జీవించే పరిస్థితి ఉండదు. ఇతర ప్రాంతాల్లో వ్యతిరేకించిన పరిశ్రమలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నిపుణుల నివేదిక ప్రకారం బల్క్ డ్రగ్ పార్క్ చాలా ప్రమాదకరమని తెలుస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా రెడ్‌జోన్‌లో ఉందని నివేదికలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వానికి ప్రజల ప్రాణాల కంటే పారిశ్రామికవేత్తలే ముఖ్యంగా కనిపిస్తోంది. ప్రజాభిప్రాయ సేకరణ అడ్డుకుని తీరుతాం.

– కె.లోకనాథం, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు

రైతులను రోడ్డున పడేస్తారా?



ప్రమాదకర పరిశ్రమలను ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అదనంగా భూములు తీసుకుని రైతులను రోడ్డును పడేయాలని చూస్తున్నారు. భూములు ఇవ్వమని రైతులు కరాఖండిగా చెబుతున్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే రైతులు, బాధితుల పక్షాన పోరాటం చేస్తాం. 6న ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాల్సిందే.

– శీరం నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు

వేట లేక మత్స్యకారులు వలస బాట



మందుల కంపెనీల వల్ల ఇప్పటికే చాలా ఇబ్బంది పడుతున్నాం. మళ్లీ కొత్తగా బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల మత్స్యకార గ్రామాల ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి. వేట లేక ఉపాధి కోల్పోతున్నారు. ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు.

– గోసల కాసులమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు

పేనాలు తీసే కంపెనీలన్నీ మావద్దే..



పేనాలు తీసే కంపెనీలన్ని మా దగ్గరే పెడుతున్నారు. మేం బతకొద్దా. ఎం పాపం చేసామని, ఇప్పటికే కంపెనీల వల్ల సానా ఇబ్బంది పడుతున్నాం. మళ్లీ భూములు తీసుకుని ఏదో పార్క్ పెడతామంటున్నారు. మా వోళ్లంతా భయపడిపోతున్నారు, పెబుత్వం దీన్ని రద్దు చేయాలని కోరుతున్నాం. అందుకే ఆఫీస్‌కు వచ్చి ధర్నా సేత్తన్నం. ఆరో తేదీన జరిగే మీటింగ్ అడ్డుకుంటాం.

– ఎరిపిల్లి నాగేష్, మత్స్యకారుడు

మమ్మల్ని బతకనివ్వరా?



మందుల కంపెనీల వల్ల సానా నట్టపోయాం. మళ్లీ కొత్త కంపెనీలు పెట్టి మమ్మల్ని బతకనివ్వరా. ఏటకు ఎల్తే సేపలు దొరకడం నేదు. కొన్ని సేపలను తింటే జబ్బులొస్తున్నాయి. కొత్తగా ఏదో కంపెనీ పెడతారంట. ఇక్కడ సానా కంపెనీలు వత్తాయి అంటన్నారు. భూములు, ఇళ్లు తీసేసుకుంటన్నారు. పెబుత్వం మమ్మల్ని ఏంసేద్దామని ఇవ్వన్ని పెడతన్నారు. అందరూ బాగానే ఉంటా, పక్కన కాపురాలు సేసే మాకే నట్టం.

– పిక్కి తాతీలు, మాజీ ఎంపీటీసీ

● భవభయ హారిణి.. పాప విమోచని..


కె.కోటపాడులో వాసవీ కన్యకాపరమేశ్వరికి గులాబి పువ్వులతో పుష్పార్చన


అనకాపల్లి గవరపాలెంలోని సంతోషిమాత అమ్మవారికి శాకంబరి దేవిగా అలంకరణ

శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారి దేవాలయాలు కళకళలాడాయి. ఎంతటి కష్టంలో ఉన్నా తల్లి మోము చూస్తే ప్రశాంతత కలుగుతుంది. ఎక్కడ లేని ధైర్యం వస్తుంది. అందుకే జిల్లాలోని అమ్మవారి గుడులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కె.కోటపాడులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి 10 వేల గులాబీ పువ్వులతో పుష్పార్చన జరిపారు. అనకాపల్లి గవరపాలెంలో ఉత్తరాంధ్రుల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి బాలాలయంలో మహిళా భక్తులతో ఉచితంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గవరపాలెం సంతోషిమాత దేవాలయంలో అమ్మవారిని శాకంబరి దేవిగా ఆలయ అర్చకులు అలంకరించారు.

కె.కోటపాడు/అనకాపల్లి

పశు పోషకుల ఆర్థిక స్థితిగతులపై బ్లాంకెట్ సర్వే


వారాడలో సర్వేను పర్యవేక్షిస్తున్న ఏడీ దినేష్‌కుమార్

కె.కోటపాడు: కె.కోటపాడు సబ్ డివిజన్ పరిధిలోని కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో పశుపోషకుల ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సమాచారం సేకరించే ఉద్దేశంతో బ్లాంకెట్ సర్వే చేపట్టినట్లు పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఇ.దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన వారాడ, వి.సంతపాలెం గ్రామాల్లో పర్యటించి, బ్లాంకెట్ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామీణ, పట్టణ ప్రాంతాలల్లో పశుపోషకులు అవసరాలు, ఆదాయ వనరులు, తదితర అంశాలపై 35 ప్రశ్నలు ఆధారంగా ఈ సర్వే గత నెల 26 నుంచి ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ సర్వేలో వారాడ, వి.సంతపాలెం, పశువైద్య సహాయకురాలు సుధారాణి, మంగ పాల్గొన్నారు.

బ్రిటిషర్ల సమాధుల స్థలాన్ని కాపాడండి


తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న టాక్స్ ఫేయిర్ అసోసియేషన్ నాయకులు కె.త్రిమూర్తులరెడ్డి, రాజు

నర్సీపట్నం: ఆక్రమణదారుల నుంచి బ్రిటిషర్ల సమాధుల స్థలాన్ని కాపాడాలంటూ మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, తహసీల్దార్ రామారావుకు టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు వీరోచిత పోరాటానికి స్ఫూర్తికి చిహ్నంగా నిలిచిన సర్వే నంబరు 9లోని 46 సెంట్ల స్థలంలో బ్రిటిష్ సైనికుల సమాధుల స్థలాన్ని కొంతమంది కబ్జా చేసి శాశ్వత భవన నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. 46 సెంట్లలో ఇప్పటికే 27 సెంట్లు ఆక్రమణకు గురైందన్నారు. మిగిలిన 19 సెంట్లలో ప్రస్తుతం నిర్మాణ పనులు చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నిర్మాణాలకు ఏవిధమైన అనుమతులు లేవన్నారు.

ఇటీవలో లీగల్ సెల్ చైర్మన్, పురావస్తు శాఖ సిబ్బంది స్థలాన్ని సందర్శించి, మున్సిపల్ అధికారుల సహకారంతో తుప్పలు డొంతకలతో ఉన్న స్థలాన్ని శుభ్రం చేయించారు. సమాధుల స్థలాన్ని కాపాడాల్సిన మున్సిపల్, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఇప్పటికైనా చారిత్రక నేపథ్యం ఉన్న స్థలాలను పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన


నిరసన తెలుపుతున్న పీఆర్‌టీయూ నాయకులు

నర్సీపట్నం: సీనియార్టీ ప్రాతిపదికన ఎంఈవో-1 పోస్టులు భర్తీ చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లా పరిషత్ హైస్కూల్(మెయిన్) వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయంలో ప్రభుత్వం తాత్సారం చేయకుండా తక్షణమే ఎంఈవో పోస్టులు భర్తీ చేయాలన్నారు. పీఆర్‌టీయూ నాయకులు అల్లు అప్పారావు, ఊరమణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వరహాలనాయుడు, రమేష్, హెచ్‌ఎం రత్నం పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట మండల టీడీపీలో వర్గభేదాలు

- కొత్త పింఛన్ పంపిణీలో మరోసారి బహిర్గతం
- ఎమ్మెల్యే రాజు V/S టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు


ఎంపీడీవో, పంచాయతీ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకుడు నరేష్

బుచ్చెయ్యపేట: వృద్ధుల పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకుల మధ్య వర్గ విభేదాలు బయటపడ్డాయి. బుచ్చెయ్యపేట మండలంలో ఉన్న మేజర్ పంచాయతీ వడ్డాదికి చెందిన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజుల మధ్య కొద్ది కాలంగా వర్గ విభేదాలు నడుస్తున్నాయి. శుక్రవారం స్పౌజ్ పింఛన్ల పంపిణీలో మరోసారి రెండు వర్గాల విభేదాలు బయటపడ్డాయి. మండలంలో ఉన్న 35 పంచాయతీలకు 196 స్పౌజ్ పింఛన్‌లు మంజూరు కాగా.. వడ్డాదికి 27 పింఛన్‌లు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో ఎమ్మెల్యే రాజు చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేయడానికి ఎంపీడీవో కార్యాలయం వద్ద వేదిక ఏర్పాటు చేశారు. ఒకటో తేదీ ఉదయం 9 గంటలకే పింఛన్లు పంపిణీ చేస్తారనడంతో ఉదయం 8 గంటలకే వడ్డాది పింఛన్‌దార్లు చేరుకున్నారు. వడ్డాది టౌన్ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్ తన సొంత నిధులతో 22 మంది వృద్ధులను బుచ్చెయ్యపేటలో ఎమ్మెల్యే రాజు పింఛన్‌ల పంపిణీ చేసే వేదిక వద్దకు ఆటోలపై తీసుకొచ్చారు. ఎమ్మెల్యే రాజు వచ్చి వేదికపై ముగ్గురికి పింఛన్లు ఇచ్చి వెళ్లిపోయారు. మిగతా గ్రామాల నాయకులు, అధికారులు కలిసి లబ్ధిదారులకు పింఛన్ నగదు బట్వాడా అక్కడే చేశారు. వడ్డాదికి చెందిన వృద్ధులకు మాత్రం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు పింఛన్‌లు పంపిణీ చేయలేదు. వారికి వడ్డాది పంచాయతీ వద్ద పింఛన్ నగదు ఇస్తామని తెలిపారు. అక్కడే ఉన్న తాతయ్య వర్గానికి చెందిన నాయకులు దొండా నరేష్, తలారి శంకర్, అక్కిరెడ్డి కనక, గురుమూర్తి, వెలుగుల నాగేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో కొత్తవారికి పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పి, ఇప్పుడు వడ్డాదిలో ఇస్తామనడంలో కారణమేమిటని ఎంపీడీవో భానోజీరావు, పంచాయతీ సెక్రటరీ ఈశ్వరరావుపై మండిపడ్డారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. గ్రూపు రాజకీయాలకు తాము బలైపోతామని గ్రహించిన అధికారులు చేసేది లేక అక్కడే వడ్డాది లబ్ధిదారులకు కూడా పింఛన్ నగదు బట్వాడా చేశారు. కొత్త పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే రాజు నుంచి తాతయ్యబాబుకు కబురు రాకపోవడంపై పలువురు టీడీపీ నాయకులు మండిపడుతున్నారు.

వాల్తేర్ డివిజన్ రన్నింగ్ స్టాఫ్ నిరాహార దీక్ష


దీక్షలో పాల్గొన్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రతినిధులు, వాల్తేర్ డివిజన్ రన్నింగ్ స్టాఫ్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్‌లో పనిచేస్తున్న రన్నింగ్ స్టాఫ్ తమ సమస్యల పరిష్కారం కోసం నిరాహార దీక్ష చేపట్టారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మర్రిపాలెం డివైడీ క్రూ లాబీ వద్ద శుక్రవారం జరిగిన ఈ నిరసనలో సిబ్బంది పలు డిమాండ్లను రైల్వే యాజమాన్యం ముందుంచారు. రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం రన్నింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, రన్నింగ్ సిబ్బందికి కనీసం 120 కిలోమీటర్ల మైలేజీకి హామీ ఇవ్వాలని, ప్రస్తుతం 16 గంటల పాటు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనివేళలను సైన్ ఇన్ నుంచి సైన్ అవుట్ వరకు 9 గంటలకు పరిమితం చేయాలని, రాత్రి షిఫ్టులు రెండు రోజులకు మించి కొనసాగించకూడదని, 36 గంటల్లోగా హోం స్టేషన్‌కు తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ ప్రెసిడెంట్ జె.సంపత్‌కుమార్ మాట్లాడుతూ వాల్తేరు డివిజన్ సిబ్బంది భారతీయ రైల్వేల్లో అత్యధిక ఓవర్ టైం పనిచేస్తున్నారని, అత్యధిక లోడింగ్ రికార్డు సాధించడంలో వారి కృషి కీలకమన్నారు. ఈ నేపథ్యంలోనే వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. నిరాహార దీక్ష ఫలితంగా జీఎం కమిటీ వేశారని తెలిపారు. యూనియన్ ప్రతినిధులు, అధికారులతో కూడిన కమిటీ సమావేశం తర్వాత డిమాండ్లను 10 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సాయంత్రం దీక్ష విరమించారు. కార్యక్రమంలో డివిజనల్ కోఆర్డినేటర్ టి.వి.మౌళి, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.నరసింగరావు, డిప్యూటీ డివిజనల్ కోఆర్డినేటర్ ఎ.వెంకటరావు, అడిషనల్ జాయింట్ జనరల్ సెక్రటరీ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సింహగిరిపై లక్ష కుంకుమార్చన


సింహవల్లీ తాయారుకి లక్షకుంకుమార్చన నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం: శ్రావణ శుక్రవారం సందర్భంగా సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చనను వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు సింహవల్లీ తాయారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలోని వేదికపై ఉంచి శాస్త్రోక్తంగా ఈ పూజను చేపట్టారు. లక్ష నామాలతో అమ్మవార్లకు కుంకుమ పూజ నిర్వహించి.. విశేష హారతి ఇచ్చారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులకు శేషవస్త్రాలు, కుంకుమ ప్రసాదం అందజేశారు. అలాగే.. సాయంత్రం అమ్మవారికి ఆలయ బేడామండపంలో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. అనంతరం సహస్రనామార్చన పూజ కూడా వైభవంగా జరిగింది. శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారి సన్నిధిని అందంగా అలంకరించారు.ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఈ పూజలు నిర్వహించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

- హెచ్‌పీసీఎల్–ఎస్‌డీఐతో ఎల్జీ ఇండియా ఒప్పందం

మహారాణిపేట: యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఎల్జీ ఇండియా సీఎస్సార్ ఫౌండేషన్, హెచ్‌పీసీఎల్–ఎస్‌డీఐ సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని హెచ్‌పీసీఎల్ కార్యాలయంలో శుక్రవారం ఇరు సంస్థల ప్రతినిధులు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా యువతకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా స్వల్ప, మధ్యకాలిక నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను అందిస్తారు. ఈ శిక్షణ ద్వారా యువతలో నాయకత్వ లక్షణాలు, ఆవిష్కరణ సామర్థ్యం పెరుగుతాయని ఎల్జీ ఇండియా సీఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ గిరిజా శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి, సురక్షిత భవిష్యత్తు అందించడమే లక్ష్యమని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు, స్వయం ఉపాధి శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా సాధికారత సాధించేందుకు ఇది తోడ్పడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎల్జీ ఇండియా గ్లోబల్ హెడ్ పాల్ క్వాన్, ఎల్జీ గ్రూప్ డైరెక్టర్ సి.కె.జియాంగ్, హెచ్‌పీసీఎల్–ఎస్‌డీఐ సీఈవో ఇంతియాజ్ అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సేవల్లో ఒకే కుటుంబం


ముగ్గురు కొడుకులు, కోడలితో లక్ష్మి

బుచ్చెయ్యపేట: ఏపీ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో వడ్డాదికి చెందిన నేతల లక్ష్మి రెండో కుమారుడు మోహన్ సీటీ పోలీస్‌గా సెలెక్ట్ అయ్యాడు. ఇప్పటికే లక్ష్మి ఇద్దరు కుమారులు పోలీస్ విభాగంలో ఉద్యోగాలు సంపాదించారు. ఈమె ముగ్గురు కుమారులతో పాటు పెద్ద కుమారుడు కోడలు కూడా పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలా కుటుంబంలో ఉన్న వారంతా ఒకే డిపార్టుమెంట్‌లో పని చేస్తుండడం విశేషం.


విశాఖలో విద్యుదాఘాతంతో కొత్తకోట వాసి మృతి


మృతి చెందిన రమణ (ఫైల్)

రావికమతం: విశాఖ నగరం కంచరపాలెంలో కరెంటు షాక్‌తో శుక్రవారం ఉదయం 8 గంటలకు రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలివి. రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన భీమరాతి రాజుబాబు(లేటు), చంద్రమ్మ రెండో కుమారుడు రమణ(41) పది సంవత్సరాల క్రితం కంచరపాలెంలో భార్య సత్యవతితో కలిసి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం నుంచి కంచరపాలెంలో ఐటీఐ జంక్షన్‌లోని శ్రీకుంచమాంబ వాటర్ వాస్ సర్వీసింగ్ పాయింట్‌లో పని చేస్తున్నారు. ఎప్పటిలాగే ఉదయం సర్వీసింగ్ సెంటర్‌కు వెళ్లిన రమణ వాటర్ మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా కరెంటు షాక్‌కు గురై మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. దీనిపై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య సత్యవతి, కుమారులు జశ్వంత్, సుశ్రుత్ ఉన్నారు. జశ్వంత్ ఐటీఐ, సుశ్రుత్ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కొత్తకోటకు తరలించామని పోలీసులు తెలిపారు. రమణ అకాల మరణంతో కొత్తకోటలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఎ.కొత్తపల్లిలో ప్రొటోకాల్‌కు తూట్లు

- కొత్త పింఛన్లపై సర్పంచ్, ఎంపీపీకి అందని సమాచారం
- టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
- వివాదాస్పదంగా మారిన సచివాలయ ఉద్యోగుల తీరు


ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల, ఎంపీపీ బుల్లిలక్ష్మి సమక్షంలో స్థానిక ఉద్యోగులను మందలిస్తున్న ఎంపీడీవో, ఏవో

దేవరాపల్లి: మండలంలోని ఎ.కొత్తపల్లి సచివాలయం పరిధిలోని ఉద్యోగులు ప్రొటోకాల్‌కు తూట్లు పొడిచారు. స్థానిక సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లపై స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మికి సైతం కనీస సమాచారం ఇవ్వకుండా టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం పింఛన్ల పంపిణీ చేయడం వివాదాస్పదమైంది. గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్, మండల ప్రథమ పౌరురాలు ఎంపీపీకి సమాచార ఇవ్వకుండా తమ గ్రామంలో ఎలా పింఛన్లు పంపిణీ చేపడుతున్నారని ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు దృష్టికి సర్పంచ్, ఎంపీపీ తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎంపీడీవో, పరిపాలన అధికారి డి.వి.లక్ష్మీనారాయణ ఏ.కొత్తపల్లి సచివాలయానికి చేరుకొని స్థానిక ఉద్యోగులతో సమావేశమయ్యారు. సిబ్బందిని మందలించారు. ప్రొటోకాల్ పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తే తదుపరి చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. మళ్లీ ప్రొటోకాల్ సమస్యలు పునరావృతం కాకుండా చూసుకుంటామని ఎంపీడీవో సర్ది చెప్పడంతో సర్పంచ్, ఎంపీపీ శాంతించారు.

కానిస్టేబుల్ పరీక్షలో మెరిశారు


రాయపురెడ్డి అన్వేష్


నేమాల చంద్రశేఖర్

దేవరాపల్లి/చోడవరం: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో పలువురు అభ్యర్థులు మంచి ర్యాంకులు సాధించారు. దేవరాపల్లి మండలంలోని తారువకు చెందిన రాయపురెడ్డి అన్వేష్ 147 మార్కులు సాధించాడు. విశాఖ గ్రామీణ విభాగంలో బీసీ–డి కేటగిరిలో అన్వేష్‌కు 12వ ర్యాంక్ లభించింది. సామాన్య రైతు కుటుంబానికి చెందిన అప్పలనాయుడు, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు అన్వేష్ ఏయూలో ఎంఎస్సీ పూర్తి చేశాడు. చోడవరం యువకుడు నేమాల చంద్రశేఖర్ ఉమ్మడి విశాఖజిల్లాలో 19వ ర్యాంక్ సాధించాడు. పేద కుటుంబానికి చెందిన చంద్రశేఖర్ తండ్రి పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మొదట్నుంచీ పోలీసు కావాలన్న ఆశయంలో ఎంబీఏ వరకూ చదివిన చంద్రశేఖర్ ప్రత్యేక కోచింగ్ తీసుకొని ఏపీ కానిస్టేబుల్ పరీక్షల్లో ప్రతిభ చూపారు. 200మార్కులకు గాను 143మార్కులు సాధించి జిల్లాలో 19వ ర్యాంకర్‌గా నిలిచారు.

క్లుప్తంగా

నూతన పింఛన్ల పంపిణీ

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో శుక్రవారం కొత్తగా 21 మంది వితంతువులకు మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. జెట్టపు రెడ్డితుని, చింతలపాలెం గ్రామాలకు చెందిన 21 మందికి వీటిని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ముగ్గురికి మంజూరైన రూ.లక్షా 50 వేల చెక్కులను పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతులకు సాగులో మెలకువలు

అనకాపల్లి: వరి నారు తీయడానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా ఉంచి వేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారుమడి నాటుకోవడానికి సిద్ధంగా ఉంటే పూత దశలో ఉన్న పచ్చిరొట్ట పైరును నేలలో కలియదున్నుకోవాలన్నారు. నేలలో పదును చూసుకుని నీటి సదుపాయం కల్పించుకోవాలన్నారు. మొక్కజొన్న మొక్క దశలో ఉన్న పైరును కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి వర్షాల అనంతరం పిచికారీ చేయాలన్నారు. చెరకు పైరులో మోజాయిక్ తెగులు ఆశించి పేనుబంక పురుగు ద్వారా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున నివారణకు డైమిథోయేట్ 2 మిల్లీలీటర్లు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు 5 గ్రాముల మల్టీకేను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన

కశింకోట: మండలంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చవద్దని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు ద్వారా ప్రజల నుంచి గుంజి వసూలు చేసే ధనం పారిశ్రామికవేత్త ఆదానీ కంపెనీకి కట్టబెట్టడానికేనని ఆరోపించారు. గతంలో నెలకు రూ.500 వరకు విద్యుత్ బిల్లు వస్తే స్మార్ట్ మీటర్ల వల్ల రూ.2500 వరకు బిల్లులు వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక ప్రతినిధులు అప్పారావు, చిరంజీవి, నూకరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

అనకాపల్లి టౌన్: స్థానిక గుండాల జంక్షన్ ఆర్వో హాల్‌లో శనివారం పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి పి. రంగాచారి ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ. 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే రూ. 5 వేలు కలిపి రూ. 7 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరు కానున్నారని తెలిపారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 106 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,300	4,300
రెండో రకం	3,500	3,520
మూడోరకం	3,100	3,400

అనకాపల్లి సినిమాలు

రాజా
: సార్ మేడమ్
సత్యనారాయణ స్క్రీన్-1:కింగ్ డమ్
సత్యనారాయణ స్క్రీన్-2 జూనియర్
పరమేశ్వరి సాయి : మహావతార్ నరసింహ
వెంకటేశ్వర : లోపలకి రా చెప్పేతా..
శ్రీ సత్య :తమ్ముడు
రామచంద్ర : హరి హర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఎ పాజిటివ్-6, బి పాజిటివ్-21, ఒ పాజిటివ్-29, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 342 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

వర్షా కాలం వ్యాధులు..
పశువులు జాగ్రత్త

- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ప్రమాదం
- అత్యవసర పరిస్థితుల్లో 1962కు కాల్ చేయాలి


గొర్రెలు, మేకలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

తుమ్మపాల: వర్షాకాలం వచ్చిందంటే చాలు వ్యాధులు దాడి చేస్తాయి. అందుకే పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధి సోకినట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా సమీపంలోని పశు వైద్యశాలను సంప్రదించాలని చెబుతున్నారు. అత్యవసర పరిస్థితిలో 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి. పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటే మెరుగైన చికిత్స కోసం దగ్గరలోని పశు వైద్యశాలకు తరలించాలని చెబుతున్నారు.

నట్టలతో ఎదుగుదలకు బ్రేక్..

గొర్రెలు పచ్చి మేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో గొర్రె ఎదగడానికి అవకాశం ఉండదు. గొర్రెల ఆహారమంతా నులి పురుగులే తినేయడంతో రోగాల బారిన పడే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఆరు నెలలకోసారి నట్టల నివారణ మందులు ఉచితంగా వేస్తుంది.

గొంతు వాపు ప్రాణాంతకం..

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైంది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ, శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు ముందుగా (హెచ్ఎస్) టీకాలు వేయించుకోవాలి. వ్యాధి బారిన పడిన పశువును మిగిలిన వాటికి దూరంగా ఉంచాలి.

వ్యాక్సిన్‌తో 'చిటుకు'కు చెక్..

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా సోకే మరో వ్యాధి చిటుకు. ఈ వ్యాధి వచ్చినప్పుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందిస్తే సంరక్షించుకోవచ్చు.

'గాలికుంటు'తో నీరసం..

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెల వంటి వాటికి సోకుతుంది. శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీల మధ్య ఉంటుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగ్గా తీసుకోలేవు. నీర సించి, నడిచేందుకూ ఇబ్బంది పడతాయి. పాల ఉత్పత్తి తగ్గుతుంది. వైద్యుల సూచన మేరకు యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ వాడాల్సి ఉంటుంది.

పీడించే 'జలగ'

మురుగునీరు, కాలువల్లో అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల జలగ వ్యాధి ప్రబలుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. పశువులు మేత మేయడంలో ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. డిస్టోడిన్ 4 మాత్రలు, 10 మిల్లీలీటర్ల నియోజడ ప్లస్ అందించాలి.


ఆవుకు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది

వర్షాకాలంలో వ్యాధులు సోకే ఆవకాశం ఎక్కువ..

గొర్రెలు, మేకలకు తప్పకుండా టీకాలు వేయాలి

పశువులు, గొర్రెలు, మేకల్లో అనారోగ్యాన్ని గుర్తిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో వ్యాధులు సోకే ఆవకాశం ఎక్కువ. వ్యాధి నివారణ టీకాలు వేయిస్తే వాటి ప్రభావం ఆరు నెలల వరకూ ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో 1962కు కాల్ చేస్తే వైద్య సేవలు అందిస్తాం. ఎలాంటి సందేహాలున్నా రైతులు పశువైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించాలి. సాధారణ రోజుల్లో కన్నా వర్షాకాలంలో పశువులు ఎక్కువగా వ్యాధులకు గుర వుతాయి. కనుక ఈ కాలంలో పశువుల పెంపకంపై శ్రద్ధ తీసుకోవడం ఎంతైనా ముఖ్యం.

– డాక్టర్ అనిల్, పశుసంవర్ధక శాఖ అధికారి, అనకాపల్లి మండలం.

నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందజేయాలి

అనకాపల్లి: అచ్యుతాపురం మండలంలో రావిపాలెం, దొప్పెర్ల, దోసూరు బార్క్ నిర్వాసితులకు జిరాయితీ భూములతో సమానంగా డి-పట్టా భూములకు రూ. 60 లక్షలు పరిహారం ఇవ్వాలని, బార్క్ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గృహాలు కోల్పోతున్న నిర్వాసితులకు రూ.25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీపీఎం జిల్లా కన్వీనర్ ఆర్.రాము, కో-జెడ్పీటీసీ నిర్మల్‌కుమార్ అన్నారు. జిరాయితీతో సమానంగా డీ పట్టా భూములకు ఎకరాకు రూ.60 లక్షల నష్టపరిహార చెల్లించాలని, 2010 నుంచి 2024 వరకు నిర్వాసిత కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి రూ. 25 లక్షలు ఆర్అర్ ప్యాకేజీ చెల్లించి మనవడు, మనవరాలు అనే తేడా లేకుండా వివాహమైన ఆడపిల్లలకు ఆర్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని, ఆర్ కార్డు ఇచ్చి బార్క్‌లో శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఇల్లు, భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు కె.వరహాలు, మండల నూకరాజు, ఈగల రాజు, తారుమూరు గోపి, మజ్జి లోవ, కణితి సన్యాసిరావు, పైల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

అనకాపల్లి: స్థానిక 82వ వార్డు నర్సింగరావుపేట, పాత బర్మాకాలనీలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ విచ్చేయనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులంతా పాల్గొనాలన్నారు.

కూటమిని గెలిపించి మోసపోయాం

- మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం, పాపయ్యపాలెం, కొండుపాలెం గ్రామస్తుల ఆవేదన
- 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో వెల్లడి


మామిడిపాలెంలో సూపర్ సిక్స్ పథకాల అమలుపై అడిగి తెలుసుకుంటున్న మలసాల భతర్‌కుమార్


పాపయ్యసంతపాలెంలో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: మండలంలో మామిడిపాలెం, పాపయ్యపాలెం, పాపయ్యసంతపాలెం, కొండుపాలెం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాలు ఎన్ని అమలు చేసిందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం కూటమి పార్టీని గెలిపించి మోసపోయామని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఛార్జీలు పెంచలేదని, ఇప్పుడు రూ.600 నుంచి రూ.1000 వరకు విద్యుత్ బిల్లు పెంచారని, కిడ్నీ బాధితులకు ఏడాది నుంచి పింఛన్లు ఇవ్వలేదని, 18 సంవత్సరాలు నిండిన ఆడబిడ్డ నిధి రూ.1500 గత ఏడాది నుంచి ఇవ్వడంలేదని, రైతు భరోసా గత ఏడాది కూటమి ప్రభుత్వం ఇవ్వలేదని, కేంద్ర ప్రభుత్వం మాత్రమే ఇచ్చిందని, తల్లికి వందనం పథకం కొంత మందికి మాత్రమే పడిందని వాపోయారు. ఆశ పడి కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం, పాపయ్యపాలెం, కొండుపాలెం వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం


గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, పీడీ సూర్యకుమారి

అనకాపల్లి: పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు ఇవ్వడంతో మొదటి వ్యాక్సిన్ పని చేయడమే కాకుండా బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము, అండాశయం క్యాన్సర్ వంటి వ్యాధుల బారి నుంచి విముక్తి కలుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత కనీసం 6 నెలల వరకు తల్లి పాలు ఇవ్వడం ఎంతో శ్రేష్టమని వైద్యులు సూచిస్తున్నారని తెలిపారు. అంతకు ముందు తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.వి.సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పీడీ సూర్యకుమారి, తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, సీడీపీవో ప్రభావతి, వైద్యులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రావణ శుక్రవారం పూజలు


సత్యనారాయణపురం కల్యాణగిరి కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి: శ్రావణమాసం రెండో శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. గవరపాలెం ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి బాలాలయంలో మహిళా భక్తులు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో సాముహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఆలయ సహాయ కమిషనర్ కె.వి.సుధారాణి అమ్మవారి ప్రసాదం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగ శ్రీను, భక్తులు పాల్గొన్నారు. అలాగే గవరపాలెం సంతోషిమాత ఆలయంలో అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, గవరపాలెం నిదానందొడ్డి కామాక్షి అమ్మవారి ఆలయం, గవరపాలెం సతకంపట్టు కనక దుర్గమ్మ వారి ఆలయం, భోగలింగేశ్వరస్వామి ఆలయం, వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, న్యూకాలనీలో అష్టలక్ష్మీదేవి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు జరిగాయి.

కనకదుర్గ అమ్మవారి ఆలయంలో..

అనకాపల్లి టౌన్: మండలంలోని సత్యనారాయణపురం కొండపై వేంచేసిన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా ఘనంగా కుంకుమ పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బోయిన రమణాజీ, అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, చైర్మన్ కోటిపల్లి వెంకట రమణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు..

కశింకోట: శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా స్థానిక కనకమహాలక్ష్మి వీధిలోని కనకమహాలక్ష్మి అమ్మ వారిని వెండి ఆభరణాలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి ఆలయం (శివాలయం)లో అమ్మ వారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. గవరపేటలోని శారదా గణపతి రామాలయంలో మహిళలు లలితా సహస్ర నామ పారాయణ నిర్వహించారు. లలితాదేవికి కుంకుమార్చనలు చేశారు. లక్ష్మీ నృసింహస్వామి, ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.


కశింకోటలో అభరణాలతో అలంకరించిన కనకమహాలక్ష్మి అమ్మవారు

కూటమి పాలనలో కనిపించని అభివృద్ధి, సంక్షేమం


కొత్తగా నియమించిన గ్రామ కమిటీ సభ్యులతో మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు నేత్రాలుగా పాలన సాగేదని, ట్రిపుల్ ఇంజన్ పాలనలో అవెక్కడా కనిపించడం లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. రింగ్‌రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పార్టీ ముఖ్య నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనపై ఏడాదిలో ప్రజలకు విరక్తి కలిగిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంలేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు సకాలంలో నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేయడంతో ప్రజల్లో నమ్మకం ఏర్పడిందన్నారు. అనంతరం మండలంలో పార్టీ గ్రామ కమిటీలను నియమించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, వైస్ ఎంపీపీ అయితా రాము, పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, 80, 84 వార్డుల ఇన్‌చార్జిలు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, మాజీ కౌన్సిలర్ దాడి నారాయణరావు, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు విల్లూరి చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు మరిపల్లి శోభ, గైపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై అవగాహన.. ర్యాలీ


ఉపాధి హామీ పథకంపై అవగాహన ర్యాలీ

అనకాపల్లి టౌన్: మండలంలోని సీతానగరంలో ఉపాధి హామీ పథకంపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుంకర చంటిబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కల్పిస్తున్న పనులను విపులంగా వివరించారు. గ్రామంలో ఇప్పటి వరకు చేసిన పనులు, భవిష్యత్‌లో చేపట్టబోయే పనులపై ఎస్ఆర్‌పీ దాస్ చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీను, ఏపీవో సుప్రియ, పంచాయతీ కార్యదర్శి మౌనిక, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'ప్రోటోకాల్ పాటించని కూటమి నేతలు'

కశింకోట: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రోటోకాల్ పాటించడం లేదని జెట్టపురెడ్డితుని పంచాయతీ వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు విమర్శించారు. కొత్తగా మంజూరైన వితంతు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించి సర్పంచ్‌ను మాత్రం ప్రోటోకాల్ ప్రకారం పంచాయతీ అధికారులు ఆహ్వానించకపోవడం, తెలియజేయకపోవడం శోచనీయమన్నారు. గతంలో తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ రహితంగా ప్రోటోకాల్ పాటించి సంక్షేమ పథకాలను అందజేశామని గుర్తు చేశారు. ఇకనైనా అధికారులు ప్రోటోకాల్ పాటించాలని కోరారు.

ఆటల పోటీలు ప్రారంభం


డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో పుషప్స్ పోటీలో పాల్గొన్న బాలురు


తాడాటలో పాల్గొన్న బాలికలు

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో శుక్రవారం విద్యార్థులకు ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోటీలను హెచ్ఎం ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలకు తాడాట, బాలురకు పుషప్స్ పోటీలు క్రికెట్, వాలీబాల్, ఖో-ఖో, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బాడ్మింటన్, కబడ్డీ, బాస్కెట్ బాల్, చదరంగం, క్యారంబోర్డు, టెన్నిస్ తదితర పోటీలు నిర్వహిస్తామని పీడీలు వి. ప్రభాకరరావు, పి. కమల తెలిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోండి


రాంబిల్లిలో తపాలా మేళా నిర్వహిస్తున్న దృశ్యం

రాంబిల్లి (అచ్యుతాపురం): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ తపాలా కార్యాలయాల్లో ఖాతాలు కలిగి ఉండాలని యలమంచిలి డివిజనల్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ ఎల్.నాయుడు సూచించారు. రాంబిల్లిలో స్థానిక పోస్ట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో తపాలా మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సంక్షేమ పథకాల నిధులు తపాలా శాఖలో జమ అవుతున్నందున ప్రతి ఒక్కరూ తపాలా ఖాతాలు తెరవాలని సూచించారు. బ్రాంచ్ పోస్ట్ మేనేజర్ జగన్నాథరాజు, శివ, కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మునగపాక: తమ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో పాటు వైర్లు సరి చేయాలని కోరుతూ శుక్రవారం సంబంధిత అధికారులకు పేటకట్టు మూల సంఘ రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్ మాట్లాడుతూ పేటకట్టు సంఘ పరిధిలోని విద్యుత్ స్తంభాలు పలు చోట్ల ఒరిగిపోయాయని, వైర్లు వేలాడుతున్నాయని, ఈ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మళ్ల సంజీవరావు, బొడ్డేడ సోమరాజు, గంగునాయుడు, రాజు, నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎగ్ కార్ట్‌తో డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి


ఎగ్ కార్ట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: డ్వాక్రా మహిళలకు ఎగ్ కార్ట్ ఏర్పాటుకు రూ.50 వేల సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. కశింకోటలో డ్వాక్రా మహిళలకు మంజూరు చేసిన ఎగ్ కార్ట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్టు ఏర్పాటుకు రూ.35 వేలు, గుడ్లతో వివిధ రకాల వంటకాలు తయారు చేసేందుకు అవసరమైన రూ.15 వేల విలువైన వస్తు సామగ్రిని ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. వీటి ద్వారా నెలకు రూ.20 వేల వరకు ఆదాయం సమకూరుతుందని అధికారులు పేర్కొంటున్నారన్నారు. కోడి గుడ్ల వాడకాన్ని పెంచేందుకు నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (నెక్)తో సెర్ప్ అధికారులు ఒప్పందం చేసుకున్నారని, దీనిలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మందికి ఎగ్ కార్టులను అందించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు.

పింఛన్ల పంపిణీ..

కశింకోటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామకృష్ణ ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి సుభాషిణి, డిప్యూటీ ఎంపీడీవో ధర్మారావు, ఏపీఎం నడిపూడి పార్వతి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన నారసింహ హోమం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో శుక్రవారం సుదర్శన నారసింహ హోమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. కాకినాడకు చెందిన శ్రీ రంగ రామానుజ జీయర్ స్వామి ఆశ్రమ వేద పండితులు శ్రీమాన్ విష్ణు, మాధవన్, శ్రీధర్ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. దేవాలయ చైర్మన్ శరగడం రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.